www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 3 ఏప్రిల్ 2025



వైఎస్ఆర్

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి-వల్లూరు

గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ హరిత రాయబారులు, పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి రఘురాం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రంలో ఎంపిడిఒ రఘురాం ఆధ్వర్యంలో వల్లూరు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు మండలంలోని పంచాయతీ కార్యదర్శిలకు, హరిత రాయబారులకు, హరిత గార్డులకు వర్మీ కంపోస్టు తయారీపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురాం మాట్లాడుతూ హరిత రాయబారులు క్రమం తప్పకుండా ప్రజల నుండి తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి సేకరించాలన్నారు. గ్రామాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, హరిత రాయబారులు, హరిత గార్డులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీల ఆకలి కేకలు!

- రూ.65 లక్షల విడుదలకు నిరీక్షణ
- భారంగా మారిన నర్సరీల నిర్వహణ
- 4 నెలలుగా అటవీ శాఖ ఎదురుచూపులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో మద్దిమడుగు, బుగ్గడ్యాం, ప్రొద్దుటూరు, కమలాపురం, కొండూరు, జమ్మలమడుగు, వేంపల్లి, మైదుకూరు నర్సరీలు ఉన్నాయి. టెర్రిటోరియల్ ఫారెస్ట్ విభాగం పరిధిలో బద్వేల్, చీకటివాండ్లపల్లి సహా మరో రెండు నర్సరీలు వెరసి నాలుగు నర్సీలు ఉన్నాయి. జిల్లాలోని 14 నర్సరీల్లో సుమారు 37 లక్షల మొక్కల పెంపకమే అటవీశాఖ లక్ష్యం. ఇందుకు అనుగుణంగా సోషల్ ఫారెస్ట్ అధికార యంత్రాంగం పరిధిలోని ఎనిమిది నర్సరీల్లో 33 లక్షలు, టెర్రిటోరియల్ ఫారెస్ట్ విభాగం నాలుగు లక్షల చొప్పున మొక్కల పెంపకం పనుల్ని చేపట్టాయి. ప్రతి ఏటా జూన్ నుంచి డిసెంబర్ వరకు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆయా పంచాయతీల్లోని బంజరు, పడావు, ఇతర అనుబంధ భూముల్లో పెద్ద ఎత్తున మొక్కలను నాటాల్సి ఉంది.

రూ.65 లక్షల కోసం నిరీక్షణ

జిల్లాలోని సోషల్ ఫారెస్ట్, టెర్రిటోరియల్ విభాగాల కింద రూ.65 లక్షల వరకు విడుదల చేయాల్సి ఉంది. సోషల్ ఫారెస్ట్ కింద రూ.50 లక్షలు, టెర్రిటోరియల్ విభాగం పరిధిలో రూ.15 లక్షలు వరకు ఉన్నట్లు తెలుస్తోంది. వారానికి ఒకసారి ఉపాధి కూలీల ఖాతాల్లో వేజెస్, మెటీరియల్ నిధుల్ని జమ చేయాలి. 2025 జనవరి నుంచి నేటి వరకు ఇటువంటి పరిస్థితి కనిపించడం లేదు. వేజెస్, మెటీరియల్ పద్దుల్లో ఏ ఒక్క పద్దు కింద పైసా కూడా కూలీల ఖాతాల్లో జమ చేసిన దాఖలాల్లేవు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో నర్సరీల నిర్వహణకు కూ లీలు సహకరించని పరిస్థితి ఏర్పడింది. ఫారెస్ట్ అధికార యంత్రాంగానికి ఏమి చేయాలో తెలియక తలలు పట్టుకుని కూర్చుంది. రెండ్రోజుల కిందటి ఉగాది, రంజాన్ పర్వదినాల్లో నర్సరీ కూలీలు అర్ధాకలి, పస్తులతో కాలక్షేపం చేయాల్సి వచ్చిందని వాపోవడం ఆందోళన కలిగించింది.

జిల్లా అటవీ శాఖలో ఉపాధి కూలీల ఆకలికేకలు మిన్నంటాయి. అటవీ శాఖ పరిధిలో సామాజిక, టెర్రిటోరియల్ ఫారెస్ట్ విభాగాలు ఉన్నాయి. సామాజిక అటవీ విభాగం పరిధిలోని ఎనిమిది నర్సరీలు, టెర్రిటోరియల్ ఫారెస్ట్ విభాగం పరిధిలో మరో నాలుగు నర్సరీలు వెరసి 12 నర్సరీల్లో 37 లక్షల మొక్కలను పెంపకం చేపట్టారు. ఈ ఏడాది జనవరి నుంచి నాలుగు నెలలుగా వేజెస్, మెటీరియల్ పద్దుల కింద ఒక్క పైసా కూలీల ఖాతాల్లో జమ కాలేదు. జిల్లాలో నర్సరీల నిర్వ హణ దగ్గర నుంచి మొక్కల పెంపకం, పంపిణీ వ్యవహారం భారంగా మారిందనే వాదన వినిపిస్తోంది. రాష్ట్రంలోనే 50 శాతం మేరకు మొక్కలను పెంచడం ద్వారా జిల్లాను సస్యశ్యామలంగా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది.



నర్సరీ పనుల్లో కూలీలు

ఆన్‌లైన్‌తో తంటా!

ఉపాధి బిల్లులను ఆన్‌లైన్ చేయాల్సి రావడం, చెల్లింపులకు నెలల తరబడి సమయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. అంతకు ముందు క్వార్టర్ల వారీగా నిధులను విడుదల చేయడం పరిపాటి. ఎటువంటి ఇబ్బందులు తలెత్తేవికావు. నర్సరీల నిర్వహణ సజావుగా సాగేది. ప్రభుత్వ మారిన ప్రాధామ్యాల నేపథ్యంలో నర్సరీ బిల్లుల చెల్లింపులు ఆలస్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. ఫలితంగా నర్సరీల నిర్వహణలో నిధుల చెల్లింపుల సమస్య ఎదురవుతోంది. సోషల్ ఫారెస్ట్ అధికార యంత్రాంగం ఉపాధి హామీ నిధుల విడుదలపై దృష్టి సారించింది. ప్రభుత్వం సహకారం అందని నేపథ్యంలో ఉపాధి కూలీల ఖాతాలకు కూలి, మెటీరియల్ నిధుల విడుదలపై మల్లగుల్లాలు పడుతోంది.

కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలి

- కలెక్టరేట్ ఎదుట నిరసనలో డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షలు నిర్వహించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని, పరీక్షల తేదీలు ప్రకటించకుంటే నిరుద్యోగుల పక్షాన డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చలో విజయవాడకి పిలుపునిస్తామని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ హెచ్చరించారు. బుధవారం కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీ ప్రకటించాలని కోరుతూ కడపలో నిరుద్యోగుల తో కలిసి మహావీర్ సర్కిల్ నుంచి ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కానిస్టేబుల్ అభ్యర్థుల పట్ల కూటమి ప్రభుత్వం నిరక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. అభ్యర్థులకు అరచేయిలో వైకుంఠం చూపిస్తుందన్నారు. 2022లో ఇచ్చిన నోటిఫికేషన్‌కు ఇంతవరకు కానిస్టేబుల్ పరీక్షలు నిర్వహించి పోస్టులు భర్తీ చేయలేదన్నారు. యువగళంలో లోకేష్ అధికారంలోకి వచ్చిన 6 నెలలలో కోర్టు కేసులు క్లియర్ చేసి పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 9 నెలలు అవుతున్న ఇంతవరకు అతీగతీ లేదన్నారు. మాది మంచి ప్రభుత్వమని కార్యక్రమాలు చేసుకోవడం కాదని నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చినప్పుడే మంచి ప్రభుత్వం అవుతుందని చెప్పారు. లేకుంటే ముంచే ప్రభుత్వం అవుతుందని విమర్శించారు. తమ స్వలాభం కోసం సొంత ప్రయోజనాల కోసం కోట్లు ఖర్చుపెట్టి సుప్రీం కోర్టులో లాయర్ ఖర్చు పెట్టుకుని కేసులు వాయిదా తీసుకుంటారు కానీ నిరుద్యోగులకు సుప్రీం కోర్టులో కేసులు మాత్రం లాయర్‌ని పెట్టి కేసు పరిష్కారం చూపే చర్యలు మాత్రం చేపట్టరు, ఇది ఎక్కడి న్యాయమని ప్రశ్నించారు. తక్షణమే సుప్రీం కోర్టులో ఉన్న కేసులు పరిష్కరించి పాత పద్ధతిలో రిజర్వేషన్ నిర్వహించి కానిస్టేబుల్ అభ్యర్థులకు మెయిన్స్ పరీక్షల తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, నగర కార్యదర్శి విజయ్, సహాయ కార్యదర్శి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు వంశీ, విద్యుత్ రామకృష్ణ, నిరుద్యోగ అభ్యర్థులు ఉదయ్ కుమార్, నాగార్జున, అంజి, శేఖర్, సాయి సాయిరాం పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట మోకాళ్లపై నిరసన తెలుపుతున్న నాయకులు, అభ్యర్థులు

క్లీన్ ఎయిర్ సిటీగా కడప



కడప నగరం వ్యూ చిత్రం

ప్రజాశక్తి-కడప

ఆంధ్రప్రదేశ్‌లోని కడప నగరం రాష్ట్రంలోనే అత్యంత తక్కువ కాలుష్యం గల నగరంగా గుర్తింపు పొందింది. కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఇటీవల విడుదల చేసిన గాలి నాణ్యత నివేదికలో కడప మొదటి స్థానంలో నిలిచింది. 10 పిఎం (పార్టిక్యులేట్ మ్యాటర్) స్థాయిలో కడప నగరంలో కేవలం 42 పాయింట్లు మాత్రమే నమోదయ్యాయి. ఇది నగరంలోని ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడంలో పెద్ద విజయంగా చెప్పుకోవచ్చు. ఇతర నగరాలతో పోల్చితే గాలి నాణ్యత కడప తరువాత 52 పాయింట్లతో నెల్లూరు రెండవ స్థానంలో నిలిచింది. కర్నూలు, ఒంగోలు నగరాలు 56 పాయింట్లతో మూడో స్థానాన్ని పొందాయి. ఈ నగరాలలో గాలి నాణ్యత సరాసరి స్థాయిలో ఉన్నప్పటికీ, మరింత మెరుగుదల అవసరమని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. విశాఖపట్నం మాత్రం అత్యంత కాలుష్య నగరంగా 120 పాయింట్లతో నిలిచింది, ఇది ఆందోళన కలిగించే విషయం. కడప నగర ప్రజలు తమ నగరాన్ని క్లీన్ ఎయిర్ సిటీగా నిలిపేందుకు సహకరించాలి. ప్రభుత్వం చేపట్టే పర్యావరణ పరిరక్షణ చర్యలకు మద్దతుగా ఉండాలి. మొక్కలు నాటడం, పునరుపయోగ నూతన పరిష్కారాలను అవలంబించడం, ట్రాఫిక్ నియంత్రణ వంటి చర్యలు మరింత కలుషితం రహిత వాతావరణాన్ని అందించడంలో సహాయపడతాయి. రాష్ట్రంలోని ఇతర నగరాలు కూడా కడప నగరాన్ని ఆదర్శంగా తీసుకుని కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలి.

పిఆర్‌సి, ఐఆర్‌పై నిర్ణయాన్ని ప్రకటించండి : ఫ్యాప్టో



ర్యాలీ నిర్వహిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

సిపిఎస్,జిపిఎస్ స్థానంలో ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానం అమలు, 12వ పిఆర్‌సి కమిటీ ఏర్పాటు, అధికారంలోకి వచ్చిన వెంటనే మధ్యంతర భృతి(ఐఆర్) ప్రకటిస్తామన్న ప్రభుత్వ మేనిఫెస్టో హామీలను వెంటనే అమలు చేయాలని రాష్ట్ర ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు మల్లు రఘునాథరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండి ఇలియాస్ బాషా అధ్యక్షతన బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు చాలా కాలంగా కోరుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించవలసిన ఆర్థిక బకాయిలు రూ.30 వేల కోట్లు ఉండగా ఇటీవల రెండు విడతలుగా రూ.7,300 కోట్లు చెల్లించారని చెప్పారు. ఇంక చెల్లించవలసిన 11వ పిఆర్‌సి, డిఎ, సరెండర్ లీవ్, సిపిఎస్ ఉద్యోగుల బకాయిలతో కలిపి దాదాపు రూ.23 వేల కోట్లు ప్రభుత్వం చెల్లించవలసి ఉందని తెలిపారు. వెంటనే చెల్లింపులకు సంబంధించి రోడ్ మ్యాప్ ప్రకటించి బకాయిల చెల్లింపుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2024 జనవరి నుంచి ఇప్పటివరకు మూడు విడతల డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని వెంటనే మంజూరుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. 2004, సెప్టెంబరు 1వ తేదీ ముందు నియామక ప్రక్రియ ప్రారంభైన వారిని పాత పెన్షన్ విధానం లోకి తీసుకోవచ్చని కేంద్రప్రభుత్వం ఇచ్చిన మెమో 57ను సైతం అమలు చేయని పరిస్థితి నెలకొన్నదన్నారు. మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీ చేసి ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయవలసిన ప్రభుత్వం నిర్లిప్త ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా సెక్రెటరీ జనరల్ రాళ్ళపల్లె అబ్దుల్లా, కో-చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, రామచంద్రబాబు, మాదన విజయకుమార్, శ్యామలాదేవి, శ్రీనివాసులరెడ్డి, ఫ్యాప్టో రాష్ట్ర నాయకులు లక్ష్మి రాజా, శ్యాంసుందర్‌రెడ్డి, ప్రవీణ్ కుమార్‌రెడ్డి, కె.సురేష్ బాబు, కె.బాల గంగిరెడ్డి, జిల్లా నాయకులు సంగమేశ్వర్‌రెడ్డి, బి.రాజు, వీరాంజనేయరెడ్డి, ఖాదర్ బాషా, పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిఒ 549 ప్రకారం వేతనాలు ఇవ్వాలి : సిఐటియు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని శానిటేషన్ వర్కర్లకు 549 జిఒ ప్రకారం వేతనం ఇవ్వాలని, ఇఎస్ఐ, ఇపిఎఫ్‌లను వర్కర్ల జీతాల నుంచి 12.5 శాతం చొప్పున కత్తిరించి చెల్లించడం దారుణమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.మనోహర్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 1952 యాక్ట్ ప్రకారం ఇఎస్ఐ 50 శాతం చొప్పున చెల్లించాల్సి ఉందన్నారు. 1948 యాక్ట్ ప్రకారం నాలుగు నుంచి 2.75 శాతం చొపి4న మేనేజ్‌మెంట్, 1.25 శాతం చొప్పున వర్కర్ చెల్లించాల్సి ఉందని చెప్పారు. 1948 యాక్ట్ ప్రకారం కనీసం వేతనం రూ.26 వేల చెల్లించాలన్నారు. జిజిహెచ్ ఎ(1) కాంట్రాక్టర్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టారని, సబ్ కాంట్రాక్టరే సర్వాధిపత్యం వహిస్తున్నాడని విమర్శించారు. సబ్ కాంట్రాక్టర్, సూపర్‌వైజర్లు మహిళా వర్కర్లను అమానుష పదజాలంతో వేధిస్తున్నారని, అధికార యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం దారుణమని వాపోయారు. ఇటీవల డెంటల్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్న వర్కర్లు ఎదురుతిరగడంతో జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. ఇప్పటికే ఒక ఉద్యోగి కనిపించకుండా పోయారని తెలిపారు. మరో ఇద్దరు సెక్యూరిటీ సిబ్బందికి విధులు అప్పగించకుండా తిప్పుకో వడం అభ్యంతరకరమని తెలిపారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

- వ్య.కా.స, కెవిపిఎస్ నాయకుల డిమాండ్

ప్రజాశక్తి-కడప అర్బన్

కాశినాయన మండలం కె.ఎన్.కొట్టాల గ్రామానికి చెందిన చాగలమరి చిన్నయ్య అనే దళితునిపై గొడ్డలితో గాయపరిచిన కోడిగుడ్లపాడు గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డిని వెంటనే పోలీసులు అరెస్టు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షులు రఘు, కాశినాయన మండల సిపిఎం కార్యదర్శి పోలయ్య డిమాండ్ చేశారు. బుధవారం రిమ్స్‌లో చికిత్స పొందుతున్న చిన్నయ్యను నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వెంకట్‌రెడ్డి మద్యం సేవించి అన్యాయంగా, దౌర్జన్యంగా చెన్నయ్యపై గొడ్డలితో గాయపరచడం వల్ల ఎడమ చేయి విరిగిందని తెలిపారు. వీపు వెనుక బర్లు దెబ్బ తిన్నాయని పేర్కొన్నారు. వెంటనే అతనిపైన ఎస్సీ, ఎస్టీ అట్రాస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు ధర్నాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. మైదుకూరు డిఎస్పి వెంటనే గాయపడిన చాగలమరి చిన్నయ్యను పరామర్శించాలన్నారు. కేసు నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గురువయ్య, నరసయ్య, సురేష్ బాబు, రవి, సాంబయ్య, కెవిపిఎస్ నాయకులు ఉదయ్, రవి పాల్గొన్నారు.



దాడిలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న నాయకులు

బద్వేలు 'లిటిల్ ఫ్లవర్' గుర్తింపు రద్దు చేయాలి


ప్రజాశక్తి-కడప అర్బన్

జిల్లాలో బద్వేల్ పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ ప్రయివేట్ స్కూలు గుర్తింపు రద్దు చేయాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్ డిమాండ్ చేశారు. బుధవారం డిఇఒ కార్యాలయంలో పరిపాలన అధికారి మునీర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బద్వేలు పట్టణంలోని లిటిల్ ఫ్లవర్ స్కూల్ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందన్నారు. పాఠశాలలో క్వాలిఫైడ్ టీచర్లతో కాకుండా అన్ క్వాలిఫైడ్ టీచర్లతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారన్నారు. అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. ఫీజులు వసూలు చేస్తూ కనీస మౌలిక సదుపాయాలను విద్యార్థులకు కల్పించడం లేదన్నారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు పాఠశాల లేకపోవడంతో గత మూడు రోజుల క్రితం పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అన్వర్ విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన అందరికీ తెలిసిందే అన్నారు. పాఠశాలలో క్రమశిక్షణ కలిగిన వాళ్ళని ఏర్పాటు చేసుకోకుండా, పాఠశాల పర్యవేక్షణ చేయకుండా కేవలం ఫీజులకు మాత్రమే పెట్టుకుని విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకుని స్కూలు గుర్తింపుని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా ఆందోళనకు పిలుపునిస్తామన్నారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి విజయ్, నగర సహాయ కార్యదర్శి శ్రీకాంత్, వంశీ పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వ కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-కడప అర్బన్

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి, ఎమ్మెల్యే ఆర్.మాధవి ఆదేశాల మేరకు కడప ఎన్ఆర్ఐ పార్టీ కార్యాలయంలో టిడిపి కువైట్ ఉపాధ్యక్షులు రహమతుల్లా ఆధ్వర్యంలో టిడిపి సభ్యత్వం కార్డులను పంపిణీ చేశారు. కార్యక్ర మంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మసాపేట శివ, కడప పార్లమెంట్ ఉపాధ్యక్షులు లోకేష్, మీడియా కో-ఆర్డినేటర్ విశ్వనాథ్, టిడిపి నాయకులు ఇర్ఫాన్, సుజ్జత్, నిజాం, ఫాజిలీన్, అరషాద్ పాల్గొన్నారు.



సభ్యత్వ కార్డులు పంపిణీ చేసిన రహమతుల్లా

రేపు ప్రభుత్వ మహిళా కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-కడప అర్బన్

కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో ఈ నెల 4వ తేదీన ఘనంగా వార్షికోత్సవ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.సలీం బాషా తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కళాశాలను స్థాపించి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఘనంగా స్వర్ణోత్సవ వేడుకలను నిర్వహించామని చెప్పారు. ప్రస్తుతం 51వ కళాశాల వార్షికోత్సవం తమ కళాశాల ఆడిటోరియంలో స్టూడెంట్ యూనియన్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఎస్‌పి అశోక్ కుమార్, గౌరవ అతిథిగా యోగి వేమన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మా హాజరవుతారని తెలిపారు.

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో మెప్మాకు చోటు

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర వ్యాప్తంగా లక్షపైన ఆర్డర్స్ పొంది డెలివరీ చేయడంతో మెప్మాకు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు వారిచే, వరల్డ్ రికార్డు యూనియన్ వారిచే 3 రకాల ప్రపంచ రికార్డ్సును వైఎస్ఆర్ జిల్లా సొంతం చేసుకుంది. విజయవాడ నుంచి వచ్చిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్, వరల్డ్ రికార్డు యూనియన్ వారు కడప జిల్లాకు అందచేసిన 3 రకాల ప్రపంచ రికార్డులను కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం మెప్మా పీడీ కిరణ్ కుమార్, సిబ్బందితో కలిసి కలెక్టర్ శ్రీధర్ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఈ అవార్డులు సాధించినందుకు మెప్మా అధికారులను అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.



మెప్మా పీడీకి అవార్డులు అందజేస్తున్న కలెక్టర్ శ్రీధర్

కరువు మండలాలపై పునరాలోచించాలి : డిసిసి



మాట్లాడుతున్న విజయ జ్యోతి

ప్రజాశక్తి - కడప

జిల్లాలోని కరువు మండలాలపై కూటమి ప్రభుత్వం పునరాలోచించి పరిశీలన జరపాలని డిసిసి అధ్యక్షులు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పా టు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ చక్రాయపేట, వేముల, కమలాపురం, తదితర మండలాల్లో కరువు పరిస్థితులు ఉన్నా వాటిని ప్రకటించలేదన్నారు. రబీలో సాగు చేసిన మినుము, తదితర పంటలు బాగా దెబ్బతిన్నాయన్నారు. ఖరీఫ్‌లో ఒక మండలానికి కూడా కరువు కింద ప్రకటించలేదని తెలిపారు. పార్లమెంటులో వక్ఫ్ సవరణ బిల్లును ప్రవేశపెడుతున్న మోడీ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉన్న చంద్రబాబు, పవన్ కల్యాణ్ మద్దతు ఉపసంహరించుకోవాలని, మద్దతు ఇవ్వడం అంటే ముస్లింలకు తీవ్ర ద్రోహం చేయడమేనని పేర్కొన్నారు. సమావేశంలో కడప, కమలాపురం అసెంబ్లీ సమన్వయకర్తలు బండి జకరయ్య, అశోక్‌రెడ్డి, పిసిసి మాజీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సత్తార్, మామిళ్ల బాబు, చిన్న కుళ్లాయప్ప, సిరాజుద్దీన్, సంజయ్ కాంత, గౌస్ పీర్, గంగయ్య, రఫీఖ్ ఖాన్, నీలం షేక్ పాల్గొన్నారు.

రాజీనామా చేయలేదు : అఫ్జల్‌ఖాన్

ప్రజాశక్తి - కడప

కడప నగర అధ్యక్ష పదవికి, పార్టీ సభ్యత్వానికి తను రాజీనామా చేయలేదని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షులు అఫ్జల్‌ఖాన్ స్పష్టం చేశారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తను నగర అధ్యక్ష పదవికి రాజీనామా చేసినట్లు తప్పుడు రాజీనామా లేఖను సోషల్ మీడియాలో ప్రచారం చేశారని, దీన్ని తాను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ రాజీనామా చేస్తే రాజీనామా లేఖను పార్టీ అధిష్టానానికి పంపించానని మీడియా సమక్షంలో చెప్పేవాడినన్నారు. ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లని తెలిపారు. ముస్లింల మనోభావాలను దెబ్బతీయడమే నియంత మోడీ అజెండా అని ఘాటుగా విమర్శించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షులు హామీదు, నాయకులు దినకర్‌రెడ్డి, కమాల్, జబ్బార్, అబిద్, మున్నా, రంతుల్లా ఖాన్, శ్యామల దేవి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్జల్‌ఖాన్

డ్వామా పీడీపై ఫిర్యాదు

- ఎన్‌సిఎస్‌సి విచారణకు ఆదేశం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

డ్వామా పీడీ, ఎపిడిపై నేషనల్ కమిషన్ షెడ్యూల్డ్ క్యాస్ట్ (ఎన్‌సిఎస్‌సి) విచారణకు ఆదేశించింది. ఈ నెల 19న డ్వామా జిల్లా అధికార యంత్రాంగం జిల్లాలోని బ్రహ్మంగారిమఠం మండలంలోని ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించింది. పలుగురాళ్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ శివ సోషల్ ఆడిట్ అక్రమాలపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉందనే ఉద్దేశంతో ముందుగానే తొలగించడం చర్చనీయాంశంగా మారింది. పలుగురాళ్లపల్లి ఫీల్డ్ అసిస్టెంట్ సోషల్ ఆడిట్ జరగక ముందే రికార్డుల ట్యాంపరింగ్ మొదలుకుని సోషల్ ఆడిట్ డిటిఎఫ్‌లను మార్చడం, మండల ప్రజావేదిక ముందు రాయాల్సిన నిర్ణయాలను మండల ప్రజావేదిక జరపక ముందే రాసి పెట్టడం వంటి అంశాలపై కలెక్టర్, ఎన్‌సిఎస్‌సి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ఎన్‌సిఎస్‌సి స్పందించి విచారణలో నేరం చేసినట్లు తేలితే ఎటువంటి చర్యలు తీసుకున్నది తనకు తెలియజేయాలని కలెక్టర్‌ను ఆదే శించినట్లు తెలిసింది.

ముస్లింలను అణగదొక్కేందుకు కుట్ర

- ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభలో వేశపెట్టిందని, పదేళ్లుగా కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వివిధ పద్ధతుల, చట్టాల ద్వారా ముస్లింలను అణగదొక్కాలని చూస్తుందని ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ సలావుద్దీన్ పేర్కొన్నారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముస్లింలను భయభ్రాంతులను గురిచేస్తూ మరొక్కసారి తన ప్రతాపం వక్ఫ్ ఆస్తులపై చూపించబోతుందని విమర్శించారు. సమాజంలో ఎన్నో సమస్యలు ఉన్నాయని, నిరుద్యోగ, మతసామరస్య, ధరల సమస్యలు ఉన్న, వాటి మీద దృష్టి పెట్టకుండా ఇప్పుడు వక్ఫ్ బోర్డు ఆస్తులను ఆక్రమించుకోవాలనే ఉద్దేశంతో వక్ఫ్ అమెండ్మెంట్ బిల్లును లోక్‌సభలో ప్రవేశ పెట్టిందని తెలిపారు. 42 సవరణల ద్వారా, ఇద్దరు అన్యమతస్తులను వక్ఫ్ బోర్డులో స్థానం కల్పించడం ముస్లిం సమైక్యవేదిక ఖండిస్తుందని చెప్పారు. వక్ఫ్ బోర్డుల అధికారమంతా కలెక్టర్లకు అప్పజెప్పడాన్ని వ్యతిరేకిస్తుందని పేర్కొన్నారు. దేవాదాయ శాఖలో అన్యమతస్తులు లేనప్పుడు వక్ఫ్ బోర్డులో ఎందుకు పెడుతున్నట్లని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం అధికారంలో ఉందంటే కారణం టిడిపినేనని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ బిల్లును వ్యతిరేకించాలని ముస్లిం సమైక్యవేదిక ద్వారా కోరుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో ముస్లింలు కలసికట్టుగా ఆందోళనలు చేస్తారని చెప్పారు.



మాట్లాడుతున్న సలావుద్దీన్

నల్ల చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గం

- మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా

ప్రజాశక్తి - కడప

నల్ల చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. బుధవారం తన నివాసంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు అమెండ్మెంట్ 2025 నూతన బిల్లు తీసుకువచ్చారన్నారు. దేశంలోని ముస్లిం మైనార్టీ వర్గాల ప్రజలకు వ్యతిరేకంగా ఈ బిల్లు ప్రవేశ పెట్టారన్నారు. రాజ్యాంగానికి తూట్లు పొడుస్తూ నల్ల చట్టాన్ని తీసుకుని రావడం దుర్మార్గమని విమర్శించారు. స్వతంత్ర భారత దేశ చరిత్రలో ఈరోజు బ్లాక్‌డేగా పరిగణించాలని తెలిపారు. రాజకీయ లబ్ది కోసం మతాలను, కులాలను చీల్చాలని చూడటం దారుణమన్నారు. బిల్లుకు టిడిపి ఎంపీలు బిల్లుకు ఆమోదం పలకడం దారుణమని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు ఇలియాస్, షఫీ, ఆజం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంజాద్‌బాషా



సమస్యలు వింటున్న టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి

అధికారులతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తా

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ప్రతి సమస్యను సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తామని టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో బుధవారం ఆయన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మైలవరం, పెద్దముడియం, జమ్మలమడుగు, పట్టణానికి చెందిన వారు పలు సమస్యలను భూపేష్ దృష్టికి తెచ్చారు. భూపేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై త్వరలోనే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



సర్పంచ్‌కు తాగునీరందిస్తూ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఇఒపిఆర్‌డి

గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు చర్యలు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని అన్ని గ్రామాల్లో చలివేంద్రాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఇఒపిఆర్‌డి రాఘవకృష్ణవేణి పేర్కొన్నారు. మండల కేంద్రమైన చాపాడు ప్రధాన రహదారిపై గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం ఆమె చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి మాట్లాడుతూ ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ట్రిపుల్ రాజన్న, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సర్పంచ్ కుమారుడు జమాల్‌వలి, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ కృష్ణమూర్తి

ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలి

- తడి, పొడి చెత్తను వేరు చేసి సంపదను సృష్టించాలి

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ప్రతి గ్రామాన్ని శుభ్రంగా ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపిడిఒ కృష్ణమూర్తి, డిఎల్‌డిఒ రమాదేవి పేర్కొన్నారు. చాపాడులో చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో బుధవారం గ్రామ పంచాయతీ వ్యర్థాల నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ప్రతి పంచాయతీ పరిధిలో చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. గ్రామాల్లో పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్లు ప్రతి 250 కుటుంబాల పరిధిలో తడి, పొడి చెత్త వేరు చేసి వాటిని తీసుకువెళ్లాలని సూచించారు. అక్కడ చెత్త నుండి వర్మి కంపోస్టు ఎరువులు తయారుచేసి సంపద సృష్టించుకోవాలని సూచించారు. తద్వారా పంచాయతీలను అభివృద్ధి చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ చట్టం ఎపిఒ జయ భారతి, సింహాద్రిపురం పంచాయతీ ఇఒ బాలకొండయ్య, పంచాయతీ సెక్రటరీలు, సర్పంచులు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.



నీటి తొట్టి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎపిఒ, నాయకులు

వేసవిలో నీటి తొట్లు ఉపయోగకరం

ప్రజాశక్తి - చాపాడు

వేసవిలో పశువులకు నీటి తొట్లు ఎంతో ఉపయోగకరమని, ఆ మేరకు ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుందని టిడిపి మండల శాఖ అధ్యక్షులు అన్నవరం సుధాకర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని చిన్నవరదాయపల్లె గ్రామంలో బుధవారం ఉపాధి హామీ నిధులతో ఏర్పాటు చేస్తున్న తొట్టి నిర్మాణానికి ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మనోహర్, ఉపాధి హామీ ఎపిఒ జగదీశ్వర్ రెడ్డి, టిఒ పల్లె నాగేశ్వర్‌రెడ్డి, చిన్న వరదాయపల్లె టిడిపి నాయకులు సుధాకర్, గంగన్న, గంగరాజు, గంగాధర్, ఫీల్డ్ అసిస్టెంట్, ప్రజలు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణానికి ఎదురుచూపులు



వంతెన నిర్మాణం చేపట్టాల్సిన గోడేరు వంక

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సీతారామపురం గ్రామ సమీపంలో గోడేరు వంకపై వంతెన నిర్మించాలని రైతులు కోరుతున్నారు. ఎన్నో ఏళ్లుగా అధికారులకు తమ సమస్యను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రైతులు స్వతహాగా నిర్మించుకున్న బండరాళ్ల కట్టడాలు వర్షం ధాటికి కొట్టుకొని పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతారామాపురం గ్రామానికి చెందిన సుమారు 30 మంది రైతులకు వ్యవసాయ పొలాలకు ఆ వంక దాటుకొని పోవాల్సిన పరిస్థితి. ప్రతి ఖరీఫ్ సీజన్‌లో వంక ఉధృతంగా ప్రవహిస్తూంటుంది. వంక దాటి పొలాలకు వెళ్లాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రొద్దుటూరు-మైదుకూరు ప్రధాన రహదారిపై నుండి పంట పొలాలకు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆ మార్గాన దారి లేకపోవడంతో వంకలో నుంచి వెళ్లకతప్పడంలేదు. సంబంధిత అధికారులకు రైతులు పలుమార్లు కలిసి విన్నవించినా ప్రతిపాదనలకే పరిమితం అవుతున్నదని రైతులు పేర్కొంటున్నారు. రైతులు నడిచి వెళ్లేందుకు ఉన్న ఏర్పాటు కూడా తొలగిపోవడంతో ఇబ్బందిగా మారింది. రూ.50 లక్షలతో ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్మాణానికి చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. పంటలు సాగు చేసిన సమయంలో, దిగుబడి చేతికి అందివచ్చిన సమయంలో చాలా ఇబ్బందికరంగా ఉంటుందని రైతులు పేర్కొంటున్నారు. గత ప్రభుత్వంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సందర్భంగా అప్పటి ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి స్వయంగా సమస్యను పరిశీలించి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని సిబ్బందికి సూచిం చారు. తర్వాత భూమి పూజ కూడా చేశారు. పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ప్రస్తుతం నూతన ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వంతెన పనులు ప్రారంభానికి నోచుకోలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు ఉపయోగపడేలా వంతెన నిర్మించాల్సి ఉందని కోరుతున్నారు.

ఆర్‌ఒల కుదింపు సరికాదు : రేషన్ డీలర్లు



విలేకర్లతో మాట్లాడుతున్న రేషన్ డీలర్లు

పజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఆర్‌ఒల కుదింపు వల్ల డీలర్లు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే దీన్ని ఆపాలని రేషన్ డీలర్లు బుధవారం ఆర్‌డిఒ సాయిశ్రీని కోరారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో వారు తమ సమస్యలపై మున్సిపాలిటీ, జమ్మలమడుగు, మైలవరం, పెద్దముడియం మండలంలోని డీలర్లందరూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీలర్లు మాట్లాడుతూ ఎండియు లాగిన్ విధానం వల్ల ప్రతి డీలర్ సగటున రెండు లేదా మూడు రోజులు మాత్రమే రేషన్ ఇస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలోని రేషన్ డీలర్ల చేతివాటంతో బ్యాక్‌లాగ్‌లు ఏర్పడ్డాయన్నారు. ఈ కారణంగా వచ్చిన ఆర్‌ఒలతో తాము రేషన్ పంపకంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొం టున్నామన్నారు. ఇది ప్రభుత్వంపై పడి చెడ్డపేరు వస్తుందన్నారు. ఈ నెలలో కుదింపు ఆర్‌ఒల కారణంతో ఒక డీలర్ ఒక క్వింటాల్ నుండి 20 క్వింటాళ్ల వరకు రేషన్ బియ్యం తక్కువగా ఇవ్వడం వల్ల ప్రస్తుత పంపిణీదారులమైన తాము చాలా నష్టపోతున్నామన్నారు. తమ సమస్యను గుర్తించి కుదింపు లేకుండా చూడాలన్నారు. రెగ్యులర్ అలాట్మెంట్ కూడా తమకు కేటా యించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఆర్‌డిఒ సాయిశ్రీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మోరగుడి విశ్వనాథ్‌రెడ్డి, రాజీవ్ నగర్ కాలనీ రవి, గూడెంచెరువు చంద్ర, మైలవరం, పెద్దముడియం, మున్సిపాలిటీ పరిధిలోని డీలర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు విరమణ తప్పనిసరి



వేణుగోపాలరావు దంపతులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి అని వైఎస్‌ఆర్ టీచర్స్ యూనియన్ నాయకుడు వెంకటనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డ్రాయింగ్ టీచర్ వేణుగోపాల్‌రావ్ బుధవారం ఉద్యోగ విరమణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ విధులు నిర్వహించేటప్పుడు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఉద్యోగ విరమణ తర్వాత ప్రశాంతమైన జీవితాన్ని గడపడానికి వీలవుతుందని తెలి పారు. వేణుగోపాలరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్‌ఆర్ టీచర్స్ యూనియన్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, శివమల్లేశ్వర రెడ్డి, రామకృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, సతీష్, విశ్వనాథ్ రెడ్డి, శిరీష, చందన, జ్యోతి, నాగమల్లీశ్వరి, నీరజ పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి - సింహాద్రిపురం



పద్మనాభరెడ్డి దంపతులను సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ఎంపిడిఒ కార్యాలయంలో పని చేసిన ఇఒపిఆర్‌డి పద్మనాభరెడ్డి సేవలు మరువలేనివని ఎంపిడిఒ కృష్ణమూర్తి పేర్కొన్నారు. పద్మనాభరెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని బుధవారం సింహాద్రిపురంలోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ అందరి మన్ననలను పొందారన్నారు. విధులను నిక్కచ్చిగా నిర్వహిస్తూ ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా వ్యవహరించారన్నారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి విరమణ సర్వసాధారణమన్నారు. అనంతరం సన్మాన గ్రహీత పద్మనాభరెడ్డి మాట్లాడుతూ మండలంలో అందరి సహకారాలతో విధులు నిర్వహించి మండల అభివృద్ధికి తన వంతు కృషి చేశానన్నారు. విధి నిర్వహణలో తనకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పద్మనాభరెడ్డి, సురేఖ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పులివెందుల డిఎల్‌డిఒ రమాదేవి, మండలంలోని సర్పంచులు, పంచాయతీ సెక్రటరీలు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

షరీఫ్ సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - లింగాల

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బాధ్యతల నుంచి విరమణ తప్పదని లింగాల జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ పేర్కొన్నారు. పాఠశాల అటెండర్ మహమ్మద్ షరీఫ్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయన సేవలు ప్రశంసనీయమని తెలిపారు. 43ఏళ్ల ఉద్యోగ సుదీర్ఘ కాలంలో ఆయన పని చేసిన సింహాద్రిపురం, వెలిదండ్ల, లింగాల హైస్కూళ్లలో ఎంతో ఓర్పు, నేర్పుతో సేవలందించారని కొనియాడారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. అనంతరం మహమ్మద్ షరీఫ్ దంపతులను ఉపాధ్యాయులు, విద్యార్థులు పూలమాలల వేసి జ్ఞాపికను అందజేసి, ఘనంగా సత్కరించారు.



మహమ్మద్ షరీఫ్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న జడ్‌పి చైర్మన్ ఎం.రామగోవిందరెడ్డి

పార్టీలకతీతంగా అభివృద్ధి చేద్దాం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

బ్రహ్మంగారిమఠం మండలాన్ని పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేద్దామని జడ్‌పి చైర్మన్ ముత్యాల రామగోవిందరెడ్డి అన్నారు. బ్రహ్మంగారిమఠం జడ్పిటిసి ముత్యాల రామగోవిందరెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్ అయినా తరుణంలో మొదటిసారిగా సొంత మండలానికి బుధవారం ఆయన విచ్చేశారు. ఎంపిపి వీరనారాయణరెడ్డి, వైసిపి నాయకులు ఆయనకు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల వారిని దర్శించుకున్నారు. మఠం ఫిట్‌పర్సన్ శంకర బాలాజీ, మేనేజర్ ఈశ్వరయ్యాచారి మఠం సంప్రదాయాల ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఎంపిడిఒ కార్యా లయం నిర్వహిస్తున్న మండల సర్వసభ్య సమా వేశంలో ఆయన మట్లాడుతూ రెండు సార్లు జడ్పీ టిసిగా మండల ప్రజలు నన్ను గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పదవి రావడం సంతోషంగా ఉందన్నారు. పార్టీలకు అతీతంగా ఎమ్మెల్యేకు మఠం అభివృద్ధికి సహకరిస్తామన్నారు. ఎంపిపి వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ రోడ్లు, శ్మశాన వాటికల అభివృద్ధికి జడ్‌పి చైర్మన్ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహశీల్దార్ దామోదర్ రెడ్డి, ఎంపిడిఒ వెంగ మునిరెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటిసిలు, వైసిపి నాయ కులు పాల్గొన్నారు.

మైదుకూరును కరువు ప్రాంతంగా ప్రకటించడం హర్షణీయం

ఖాజీపేట : మైదుకూరు నియోజకవర్గాన్ని ప్రభుత్వం కరువుగా ప్రకటించడం హర్షణీయమని మండల టిడిపి సీనియర్ నాయకులు సందుల నాగశివారెడ్డి, కెసి కెనాల్ మాజీ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఇట్టెం శ్రీరాముల యాదవ్, మైదుకూరు నియోజకవర్గం బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తుట్టే రాము యాదవ్, లక్కు పుల్లారెడ్డి బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. కొన్నేళ్లుగా వ్యవసాయ రంగం నష్టాల్లో ఉందని, పంటలకు సరైన గిట్టుబాటు ధర లేకపోవడం, దిగుబడులు తగ్గడం వంటి పరిస్థితుల నేపథ్యంలో నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించడం సంతోషకరమన్నారు. మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ రైతుల పట్ల ప్రత్యేక చొరవ చూపారన్నారు.

ఉచిత కోచింగ్ ప్రవేశాలు ప్రారంభం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్నేహిత అమృత హస్తం సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత విద్య ఉపాధ్యాయ బృందంచే పాలిసెట్, ఎపిఆర్‌జెసి ప్రవేశాల నిమిత్తం నిర్వహించే పరీక్షలకు తయారయ్యేందుకు ఉచిత కోచింగ్‌లో ప్రవేశాలకు బుధవారం రమణప్ప పాఠశాలలో శ్రీకారం చుట్టారు. గత 16 ఏళ్లుగా కోచింగ్ ఇస్తున్నారు. ఈ అవకాశాన్ని 10వ తరగతి పరీక్షలు రాసిన గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సుబ్బారెడ్డి, క్రిష్ణారెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, విజయానందన్ రెడ్డి, స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు కోరారు. కార్యక్రమంలో నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్ హరీష్, గంగా వరప్రతాప్ పాల్గొన్నారు.



పవేశాలు ప్రారంభిస్తున్న ఉపాధ్యాయులు



ర్యాలీలో పాల్గొన్న విద్యాశాఖాధికారులు

బాలికల విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

ప్రజాశక్తి - ఖాజీపేట

బాలికల సంక్షేమం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం కోసం ఎనలేని కృషి చేస్తోందని, దాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారి నిత్యానంద్ పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిట్ స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. పాఠ్య పుస్తకాలు, రాత పుస్తకాలు, పుస్తకాల సంచి, ఏకరూప దుస్తులు, పాదరక్షల నాణ్యతను పరిశీలించారు. అనంతరం కస్తూర్బా బాలికల ఉన్నత పాఠశాల ప్రవేశాలకు సంబంధించి నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల విద్య కోసం రూ.కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కస్తూర్బా బాలికల పాఠశాలల ద్వారా ఇంటర్ వరకు ఉన్నత విద్యను బోధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, ఎంఇఒ స్వర్ణలత, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుజాతమ్మ, కస్తూర్బా పాఠశాల ప్రిన్సిపల్ భార్గవి, ఎంఆర్‌సి సిబ్బంది వెంకటేశ్వరరెడ్డి, సుజాత, యోహాన్, ఆశీర్వాదం, పిచ్చయ్య పాల్గొన్నారు.

మైదుకూరు అర్బన్ సిఐగా శ్రీహరి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)



డిఎస్‌పి రాజేంద్ర ప్రసాద్‌ను కలిసిన అర్బన్ సిఐ శ్రీహరి

శాంతిభద్రతల కాపాడుటలో కఠినచర్యలు తప్పవని అర్బన్ సిఐ శ్రీహరి తెలిపారు. మైదుకూరు అర్బన్ సిఐగా బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సమస్యలు ఉంటే తనను నేరుగా కలవ వచ్చన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉం డాలని ప్రజలకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తెలిపారు. అనం తరం సిఐ శ్రీహరి డిఎస్‌పి రాజేంద్రప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

తొండూరు ఎస్ఐ వల్లూరుకు బదిలీ

ప్రజాశక్తి - తొండూరు



తొండూరు ఎస్ఐ పెద్ద ఓబన్న వల్లూరు పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎస్ఐల బదిలీల్లో భాగంగా ఆయన వల్లూరు వెళ్లారు. మండలంలో ఆయన సేవలను పలువురు ప్రశంసిస్తున్నారు.

అన్ని కార్యాలయాలు ఒకే చోట ప్రయోజనకరం

- మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే సముదాయంలో ఏర్పాటు చేయడం ప్రయోజనకరమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని కానపల్లె గ్రామంలో ఏర్పాటు చేసిన కె3 గ్రామ సచివాలయ భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి, ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డితో కలిసి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పారిశ్రామికీకరణ, రోడ్ల నిర్మాణం ద్వారా సంపద సృష్టి జరుగుతుందని వివరించారు. తాను ప్రాతినిధ్యం వహించే ధర్మవరం, పుట్టిన ఊరు ప్రొద్దుటూరుకు స్థానిక ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డితో కలిసి అభివృద్ధి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయి శ్రీ, తహశీల్దార్ గంగయ్య, బిజెపి జిల్లా నాయకులు వంగల శశిభూషణ్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'శ్రీవిద్యాధరి' చిన్నారులకు మంత్రి అభినందనలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పట్టణంలోని శ్రీవిద్యాధరి పాఠశాల విద్యార్థులు శాంకరి, కుమారస్వామి, చరిత, దీపిక ధన్విత, సుమిత్ర, సిఇఒ భానుప్రకాష్‌ను బుధవారం ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ అభినందించారు. మంత్రి బుధవారం కడపకు విచ్చేశారు. చిన్నారులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆశీర్వదించారు.

ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు తరగతులు నిర్వహించాలి

ప్రొద్దుటూరు : ఇంటర్ బోర్డు ఆదేశాల మేరకు తరగతులు నిర్వహించాలని ప్రయివేట్ టీచర్స్, లెక్చరర్స్ సంఘ రాష్ట్ర కన్వీనర్ గడ్డం రాజు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లాలోని ప్రయివేట్ అన్ ఎయిడెడ్ జూనియర్ కళాశాలలు ఇంటర్మీడియట్ బోర్డ్ ఆదేశాలను పాటించడానికి నిరాకరిస్తున్నాయన్నారు. వాస్తవానికి బోర్డు ఆదేశాల ప్రకారం ఏప్రిల్ ఒకటి నుండి 24వ తేదీ వరకు అన్ని గ్రూపుల వారికి ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం క్లాసులు నిర్వహించాల్సి ఉందన్నారు. అందునా 15శాతం సిలబస్ కూడా పూర్తిచేసే విధంగా టైం టేబుల్‌ను విడుదల చేశారన్నారు. వాస్తవానికి ప్రయివేట్ యాజమాన్యం లెక్చరర్స్‌కి జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. జీతాలు ఇవ్వాలనే దురుద్దేశంతో బోర్డు ఆదేశాలను యాజమాన్యాలు ఉల్లంఘిస్తున్నాయన్నారు. జిల్లాలోని కొన్ని యాజమాన్యాలు సైన్స్ గ్రూపులకే అరకొరగా తరగతులు నిర్వహించేలా పథకాలు రచిస్తున్నాయన్నారు. ఇలా బోర్డు ఆదేశాలను పాటించని కళాశాలలపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

క్రైం కార్నర్

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

- దొంగతనాలకు పాల్పడుతున్న గుర్తుతెలియని వ్యక్తులు

ప్రజాశక్తి - వేంపల్లె

గుర్తు తెలియని వ్యక్తులు చిల్లర దొంగతనాలకు పాల్పడుతున్నారు. మంగళవారం రాత్రి స్థానిక మెయిన్ బజార్‌లో ఉన్న అమ్మవారిశాల అంగన్వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. అంగన్‌వాడీ కేంద్రానికి ఉన్న తాళాలు తీసి అక్కడ ఉన్న 35 ప్యాకెట్లు కందిపప్పు, నాలుగు బాక్సులు (40 లీటర్ల) పాల ప్యాకెట్లును తీసుకెళ్లినట్లు అంగన్వాడీ కార్యకర్త తెలిపారు. జిల్లా పరిషత్ బాలుర పాఠశాల సమీపంలో ఉన్న ఇందు టావెల్స్ కార్యాలయానికి ఉన్న బీగాలు పగులగొట్టి రూ.45 వేలు నగదు, మూడు పాత సెల్‌ఫోన్లు చోరీకి గురైనట్లు బాధితుడు సురేష్ తెలిపారు. అంగన్వాడీ కేంద్రం ఉన్న ప్రాంతంలో సాయంత్రం వేళ ఎక్కువ మంది ఆకతాయిలు ఉంటారని, వారి పనే అయి ఉంటుందని అంగన్వాడీ కార్యకర్త అనుమానం వ్యక్తం చేశారు. చంటి పిల్లలు, గర్భిణులు తినే పౌష్టికాహారాన్ని కూడా గుర్తు తెలియని వ్యక్తులు వదలడం లేదు. రెండు రోజులు క్రితం పులివెందుల బైపాస్ రోడ్డులో చిన్న దుకాణాల్లో చోరీలు జరిగినట్లు సమాచారం. ఆ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



చోరీ జరిగిన అమ్మవారిశాల అంగన్వాడీ కేంద్రం

ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No. 378/2021

దూబాటి వెంకట రామరాజు, S/o రామరాజు, వయస్సు 70 సం॥రాలు, R/at D.No.7/206, జ్యోతినగర్, ఆచార్ల కాలనీ, ప్రొద్దుటూరు టౌన్, మరియు మండలము, కడప జిల్లా. ...వాది

Vs

మాప ప్రసాద్ @ ఎమ్.ఆంజనేయ ప్రసాద్, S/o మాప చలం, వయస్సు 32 సం॥రాలు, ప్రైవేటు యంప్లాయి, R/at.D.No.8/157, శ్రీరాములపేట, ప్రొద్దుటూరు టౌన్ మరియు మండలము, కడప జిల్లా. ...ప్రతివాది

సమను

పై నెంబరులోని వాది, ప్రతివాది అయిన నీపై, పై కోర్టు యందు దావా మొత్తం రా కోరి పై దావాను దాఖలు చేసి ఉన్నారు. అట్టి దావా యందు నీకు ఏమైన ఆక్షేపణలు ఉన్న యడల పై కోర్టు యందు 07.05.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరయ్యి తెలుపుకోవలయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా : 07.05.2025

//By Order of the Court//

G. SREERAMA CHANDRA PRASAD, B.A.,B.L.,

Advocate, PRODDATUR.

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

O.S.No. 182/2022

బొందలకుంట నాగేశ్వర రెడ్డి, తండ్రి బి. గంగిరెడ్డి, వయసు 45 సంవత్సరాలు, హిందూ, వ్యవసాయం, డోర్ నెంబర్ 1/3413, రేగడి పల్లి గ్రామం, కొండాపురం మండలం, వైఎస్సార్ కడప జిల్లా. ...వాది

వర్సెస్

రామిశెట్టి సురేష్, తండ్రి సుబ్బరాయుడు, వయసు 50 సంవత్సరాలు, హిందూ, కానిస్టేబుల్, చిట్వేలి పోలీస్ స్టేషన్, పి.సి. నెం.1986, చిట్వేలి టౌన్ మరియు మండలం, వైఎస్సార్ కడప జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పైన పేర్కొన్న వాది, ప్రతివాది అయిన మీరు ఇవ్వవలసిన ప్రోనోటు బాపతు బాకీ సంబంధించి డిక్రీ కోరుతూ మీపైన దాఖలు చేసిన దావా మీ హాజరు కొరకు పైకోర్టులో 07.04.2025న వాయిదా ఉన్నది. అట్టి దావాలో మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఆతేదీన పైకోర్టులో ఉదయం 10:30 గంటలకు హాజరై తెలుపుకొనవచ్చును. లేనంతటా మీకు పరోక్షముగా తీర్మానించబడును.

వాయిదా తేదీ: 07.04.2025

//బై ది ఆర్డర్ ఆఫ్ ది కోర్టు//

సి. సుబ్బారెడ్డి,

వాది తరపు అడ్వకేట్, జమ్మలమడుగు.

IN THE COURT OF THE I Addl. Dist. JUDGE, KADAPA

A.S.No. 58/2023

The Kadapa Dist. N.G.O.s Co-Op. House Building Society Ltd. Kadapa. ...Appellant

Vs

1. N.Venkatarami Reddy, S/o Rami Reddy, D.No.9/189, Nabikot, Akkayapalli, Kadapa City & Dist.
3. Darisa Pullaiah, S/o Late. Subbarayudu, D.No. 2/3834, Nehru Nagar, Chinnachowk, Kadpa City & Dt.
5. Yelagalapalli Venkata Subba Reddy, S/o Venkata Reddy, D.No.42/85-4, Flat No.202, N.G.O.Colony, Kadapa and Two Others.

...Respondents

NOTICE TO RESPONDENTS 1,3 AND 5

అప్పిలెంటు వేసిన పై తెల్పిన అప్పీలు మీరు అనగా 1,3 మరియు 5 రెస్పాండెంట్లు హాజరగుటకు గాను వాయిదా 16.4.2025న ఉన్నది. కావున మీరు ముగ్గురు పై తేదీన, పై కోర్టు నందు ఖుద్దున గాని లేదా వకీలు ద్వారా గాని ఉదయం 10.30 గంటలకు హాజరై మీ ఆక్షేపణలు తెల్పుకోవలసినది. లేనంతట మీ పరోక్షమున తీర్మాణించబడునని తెలియజేయడమైనది.

ఎన్. రవీంద్రనాధ రెడ్డి

అప్పిలెంటు పరం న్యాయవాది